క్లుప్తంగా

గోలింగేశ్వరస్వామికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో గోలింగేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గ్రామంలోని గోలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం జ్యేష్ఠ మాసం మాసశివరాత్రి సందర్భంగా స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

శ్రీనివాసరావు సేవలు అభినందనీయం



ప్రిన్సిపాల్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న కళాశాల అధ్యాపకులు

రంగంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శ్రీనివాసరావు చేసిన సేవలు అభినందనీయమని కళాశాల సిబ్బంది కొనియాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించి ఇటీవల పదోన్నతి పొంది జగ్గంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన వేమగిరి శ్రీనివాసరావును, ఇదే కళాశాలలో బోటనీ అధ్యాపకురాలుగా పనిచేసి ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందిన బి.హేమను గురువారం కళాశాలలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ విద్యా బోధనలోను, కళాశాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలోను శ్రీనివాసరావు నిరంతరం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మాధురి, కృష్ణమూర్తి, రమణ, శేఖర్ బాబు, శ్యామలారావు, ప్రసాద్, లైబ్రేరియన్ పద్మావతి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక



వెలమ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

బిక్కవోలు: అనపర్తి, మండపేట నియోజకవర్గాల బ్రాహ్మనాయుడు వెలమ సంక్షేమ సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గురువారం పందలపాక గ్రామంలో జరిగిన సమావేశంలో సంఘం అధ్యక్షుడిగా కర్రి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా నౌడు వెంకటరమణ, గేదెల వీరబాబు, జనరల్ కార్యదర్శిగా కొల్లి శ్రీనివాస్, జాయింట్ కార్యదర్శులుగా సప్ప శ్రీనివాస్, భోజంకి శివరామకృష్ణ, ట్రెజరర్‌గా సబ్బారావు సూర్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా బొడ్డు వెంకట సూర్యనారాయణ, సిరికి కృష్ణారావు, తెంటు సూరిబాబు, కసిరెడ్డి అప్పారావు, మరక సత్యనారాయణ తదితరులను ఎంపిక చేశారు.

బిక్కవోలు ఎంపీపీ జ్యోతిర్మయి రాజీనామా

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు కొవ్వూరి జ్యోతిర్మయి శేషుకుమారి వ్యక్తిగత కారణాలతో తన పదవికి గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామచంద్రమూర్తికి అందజేశారు. ఎంపీపీ జ్యోతిర్మయి రాజీనామాకు ఆమోదం తెలపడంతో పాటు నూతన ఎంపీపీని ఎన్నుకునే వరకూ వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావుకు బాధ్యతలు అప్పగించాల్సిందిగా బిక్కవోలు ఎంపీడీఓ కార్యాలయానికి ఉత్తర్వులిచ్చారు.

నర్సరీల్లో పర్యాటకం అభివృద్ధిపై సమీక్ష

కడియం: కడియం ప్రాంత నర్సరీల్లో టూరిజం అభివృద్ధిపై సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ పాలక వర్గ సభ్యులతో గురువారం జిల్లా టూరిజం శాఖాధికారులు, ఉద్యానశాఖాధికారులు సమావేశమయ్యారు. కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సమావేశంలో టూరిజం రీజినల్ డైరెక్టర్ వి.స్వామి నాయుడు, డీటీవో వెంకటాచలం, ప్రాజెక్టు డైరెక్టర్ ఆఫ్ ఏపీఎంఐపీ, హార్టికల్చర్ డీడీ హెచ్.దుర్గేష్, కడియం హార్టికల్చర్ ఆఫీసర్ డి.సుధీర్ కుమార్, నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు, సభ్యులు పాల్గొన్నారు. కడియపులంక అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలు అంశాలను చర్చించారు. కడియం నర్సరీలను పర్యాటక పరంగా అభివృద్ధి చేయడానికి, పర్యాటకులను ఆకర్షించడానికి ఇంటర్నల్ కలెక్టివిటీ పాత్‌వేలు, ట్రీ హౌస్ట్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రపంచానికి కడియం ప్రాంత నర్సరీలను మరింత చేరువ చేయడానికి వీలుండే సాధ్యాసాధ్యాలపై చర్చించారు.

అక్కడ వాన.. ఇక్కడ ముంపు

- పొంగుతున్న బురద కాలువ
- ముంపు బారిన శ్రీరంగపట్నం



బురద కాలువ పొంగడంతో శ్రీరంగపట్నంలోకి చేరిన నీరు (ఫైల్)



గ్రామంలోని ఓ ఇంటి చుట్టుముట్టిన వరద (ఫైల్)

మధురపూడి: సాధారణంగా భారీ వర్షాలు కురిసినప్పుడు గ్రామాలు ముంపు బారిన పడతాయి. వాన నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో ఈ సమస్య ఏర్పడుతుంది. కానీ కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామానికి విచిత్రమైన సమస్య ఉంది. ఏజెన్సీ ప్రాంతంలో జోరుగా వర్షాలు కురిసినా, కొండ కాలువలు పొంగినా.. ఈ నీరంతా బురద కాలువ ద్వారా ప్రవహించి ఈ గ్రామాన్ని ముంచెత్తుతుంది. అలాగే సూరంపాలెం రిజర్వాయర్‌లో అదనపు జలాలను విడుదల చేసినా ఈ గ్రామస్తులకు కష్టాలు తప్పవు.

లోతట్టు ప్రాంతం : ఎక్కడ చినుకు పడినా శ్రీరంగపట్నం మునక తప్పడం లేదు. బురద కాలువ ఈ గ్రామం మీదుగా వెళ్లడంతో పాటు, ఇది లోతట్టు ప్రాంతం కావడం దీనికి కారణం. రెండు రోజుల క్రితం మధ్యాహ్న సమయంలో ఉన్నట్టుండి బురద కాలువ పొంగి, ఊరిలోకి నీరు ప్రవేశించింది. గ్రామంలోని వీధులు ముంపు బారిన పడ్డాయి. అనంతరం సాయంత్రానికి నీరు లాగడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

మేజర్ పంచాయతీ : కోరుకొండ మండలంలో శ్రీరంగపట్నం మేజర్ పంచాయతీ. ఈ గ్రామంలో కళాకారులు ఎక్కువ.నాలుగు పేటలు, 13 వేల మంది జనాభా, 8,500 మంది ఓటర్లున్నారు. ఈ గ్రామాన్ని ఏళ్ల తరబడి ముంపు సమస్య వెంటాడుతోంది. బురద కా లువ రూపంలో వరద నీరు నివాస గృహాలపైకి చేరుతోంది.

ప్రమాదకరం : బురద కాలువ చాలా ప్రమాదకరంగా మారింది. అటవీ ప్రాంతంలో కురిసి వర్షం నీరంతా బురద కాలువలోకి ప్రవహిస్తుంది. సూరంపాలెం జలాశయం (రిజర్వాయర్), గంగవరం మండలం నెల్లిపూడిలోని ప్రధాన కాలువను కలుపుకొని దీని ప్రవాహం సాగుతుంది. గంగవరం, గోకవరం మండలాల్లోని గ్రామాల మీదుగా కోరుకొండ మండలానికి చేరుతోంది. అయితే అకస్మాత్తుగా వరదనీరు రావడంతో గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే వరద నీరు తగ్గిన తర్వాత బురదతో సమస్యలు ఏర్పడుతున్నాయి. అనేక రోగాలు ప్రబలుతున్నాయి. ముఖ్యంగా జ్వరాలు, డయేరియా, అతిసార వ్యాధులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

శాశ్వత పరిష్కారం



శ్రీరంగపట్నంలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. వరదనీరు ఉధృతంగా వచ్చిన సమయంలో రాఘవపురం వద్దగల కోటి బురద కాలువ లాక్‌ను ఎత్తివేయాలి. అప్పుడు నీరు కోటి వైపునకు నీరు వెళతుంది. అలాగే శ్రీరంగపట్నంలోని లోతట్టు ప్రాంతాల చుట్టూ రక్షణ గోడలు నిర్మించాలి.

– మద్దాల పెద్ద అమ్మాజీ, సర్పంచ్, శ్రీరంగపట్నం

ఆధునీకరణ



ప్రధాన కాలువను పటిష్ట పర్చడంతో పాటు పిల్ల కాలువలను ఆధునీకరించాలి. ఎన్నో సంవత్సరాలుగా ఈ ముంపు సమస్య నెలకొంది. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మంజూరు చేయించిన రక్షణ గోడ, చెక్ డ్యామ్‌ల నిర్మాణం పూర్తి చేయాలి. అప్పుడు వరద నీరు గ్రామాన్ని ముంచెత్తదు.

– తనకాల ప్రసాద్, మాజీ పీఏసీఎస్ మెంబర్, శ్రీరంగపట్నం

పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరచాలి



సీతానగరం లంకూరులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ



సీతానగరం ప్రధాన డ్రైనేజీలో పూడిక తీస్తున్న పంచాయతీ సిబ్బంది

సీతానగరం: గ్రామాలలో పారిశుధ్య చర్యలను మరింత మెరుగుపర్చాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సూచించారు. సీతానగరం పంచాయతీ పరిధిలోని లంకూరులో పది మంది డయేరియా సోకి ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్నారు. వారిని గురువారం ఎమ్మెల్యే పరామర్శించి, అనంతరం గ్రామంలో పర్యటించారు. పంచాయతీ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అవినాష్, పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు. డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, మార్కెట్‌లో చేపలు, మాంసం దుకాణాలు బంద్ చేయాలని, అలాగే పానీపూరి బళ్లు వంటి తినుబండారాల షాపులను పది రోజుల వరకు మూసి వేయించాలని, వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి విచారించాలని, వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు గ్రామంలో పర్యటించారు.

డయేరియా కాదు.. ఫుడ్ పాయిజన్

లంకూరులో ఫుడ్ పాయిజన్ కారణంగా ప్రజలు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారని, అది డయేరియా కాదని సర్పంచ్ కోండ్రపు ముత్యాలు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ పంచాయతీ సంబంధించిన రెండు వాటర్ ట్యాంక్‌లను శుభ్రపర్చామని, అలాగే తాగునీటిని ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా టెస్టింగ్‌కు పంపించగా రిపోర్ట్ సక్రమంగా వచ్చిందన్నారు. సుమారు పది మందికి వాంతులు, విరోచనాలు అవ్వడానికి ఫుడ్ పాయిజనే కారణమన్నారు. గ్రామంలో కిలో రూ.50కి చేపలు కొనుగోలు చేసిన వారికి, కర్రీ పాయింట్ నుంచి కూర తెచ్చుకున్న వారికి వాంతులు, విరేచనాలు అయ్యాయన్నారు. గ్రామంలో డ్రైనేజీలను శుభ్రం చేశామని, బ్లీచింగ్ చల్లించామన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదేశాల మేరకు చేపలు, మాంసం దుకాణాలు, జంక్ ఫుడ్, కర్రీ పాయింట్ దుకాణాలను పది రోజులు మూయించడం మంచి నిర్ణయమన్నారు.

ముమ్మరంగా ఖరీఫ్ వరినాట్లు



వరి నాట్లు వేస్తున్న కూలీలు

రాజానగరం: మండలంలో ఖరీఫ్ వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. నరేంద్రపురం, నందరాడ, కలచవర్ల, తూర్పుగానుగూడెంలో ఎక్కువ శాతం మంది రైతులు బోర్ల సాయంతో వరి నాట్లు వేసే కార్యక్రమాన్ని చాలావరకూ పూర్తి చేశారు. మిగిలిన ప్రాంతాలలో పొలాల్లో దుక్కులు చేయడం, నాట్లు వేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిమ్ తెలిపారు. ఆర్‌పీబీఐఓ 226, ఎంటీయూ 7029, ఎంటీయూ 1318, పీఎల్‌ఏ 1100, ఎంటీయూ 1061 వంటి వరి వంగడాలను ఎక్కువ మంది రైతులు సాగు చేస్తున్నారు. చాలామంది రైతులకు శాఖాపరంగా ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు సరఫరా చేశారు. సొసైటీల ద్వారా ఎరువులు, విత్తనాలు కూడా అందించేలా చర్యలు తీసుకున్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

భూసారాన్ని పెంపొందించే దిశగా పచ్చిరొట్ట సాగుకు కూడా జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలను 50 శాతం సబ్సిడీ పై సరఫరా చేశామని వ్యవసాయాధికారి ఖాసిమ్ తెలిపారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులతో రైతులు మోసపోకుండా దుకాణాలను తరచూ తనిఖీలు చేస్తున్నామన్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా, ఎవరికైనా తేడా జరిగితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, తక్షణమే తగు చర్యలు తీసుకుంటామన్నారు.

1,172 మట్టి నమూనాల సేకరణ

మండలంలో భూసార పరీక్షల కోసం 1,172 మట్టి నమూనాలను సేకరించామని మండల వ్యవసాయాధికారి తెలిపారు. ప్రస్తుతం వీటిని పరీక్షల కోసం పంపించామని, రిపోర్టులు వచ్చిన వెంటనే ఆయా రైతులకు అందజేస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను అనుసరించి సాగు హక్కు పత్రాలను కూడా జారీ చేస్తున్నామన్నారు.

అక్రమ చెరువుల తవ్వకాలు నిలిపివేయాలి



వడిశలేరులో చేపలు, రొయ్యల చెరువులు తవ్వుతున్న జేసీబీ

రంగంపేట: మండల పరిధిలోని వడిశలేరు గ్రామంలో అక్రమంగా చేపట్టిన చేపలు, రొయ్యల చెరువుల తవ్వకాలను నిలిపివేయాలని గ్రామ రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రశాంతికి గురువారం అందజేశారు. వడిశలేరు గ్రామంలో మాత్ చెరువు, ఆ చెరువుకు ఆనుకుని ఆయకట్టుకు సంబంధించిన పిల్ల కాలువ ఉందన్నారు. ఈ కాలువ ద్వారానే తమ పంటలకు అవసరమైన సాగునీరు అందుతుందని ఇప్పుడు అక్కడ చేపలు, రొయ్యలు చెరువులు తవ్వితే సాగునీరు కలుషితమై తమ వ్యవసాయానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పైగా గ్రామంలోని నివాస గృహాలకు కేవలం 100 మీటర్ల దూరంలోనే జేసీబీల సాయంతో చెరువులు తవ్వుతున్నారని దీనివల్ల గ్రామ ప్రజలకు కూడా నష్టం జరుగుతుందన్నారు. చేపలు, రొయ్యల చెరువులు తవ్వడం వల్ల 200 ఎకరాల ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతామని కలెక్టర్‌కు వివరించారు. కావున తమ గ్రామంలో చేపలు, రొయ్యల చెరువులు తవ్వకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

మాజీ మంత్రి వేణుకు పరామర్శ



మాజీ మంత్రి వేణు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: మాతృ వియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, అనపర్తి ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డిలు గురువారం రామచంద్రపురంలో పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వేణు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనపర్తి మండలం కుతుకులూరులో వైఎస్సార్ సీపీ నేత ఆర్‌కే దుర్గారెడ్డి కుమార్తె ఇటీవల అనారోగ్య కారణంగా మృతి చెందారు. దుర్గారెడ్డి కుటుంబాన్ని డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పరామర్శించి సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కన్వీనర్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, వార్డు సభ్యుడు సబ్బెళ్ల రామారెడ్డి పాల్గొన్నారు. పెదపూడి మండలం పెద్దాడ గ్రామంలో ఇటీవల ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న సర్పంచ్ డోకుబుర్ర మీనాక్షి మావయ్యను మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ, ముత్యాల నారాయణరావు, వాసంశెట్టి అప్పారావు, పైడిమళ్ల సత్యనారాయణ, కంకిపాటి దొర తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల ఆశాజ్యోతి వంగవీటి రంగా



పుట్టకొండ గ్రామంలో రంగా విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సర్పంచ్ వెంకటరమణ

పెదపూడి: వంగవీటి మోహన్‌రంగా నిరుపేదల ఆశాజ్యోతి అని పుట్టకొండ, వేండ్ర గ్రామాల సర్పంచ్‌లు వల్లు వెంకటరమణ, కోసూరి వాసు అన్నారు. వంగవీటి రంగా 68వ జయంతి వేడుకలను పుట్టకొండ, వేండ్ర తదితర గ్రామాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్‌లు వల్లు వెంకటరమణ, కోసూరి వాసు మాట్లాడుతూ రంగా కులం, మతం, వర్గాలకు అతీతంగా పని చేసిన నేత అని కొనియాడారు. కార్యక్రమంలో పుట్టకొండ ఉప సర్పంచ్ మిరియాల శ్రీను పాల్గొన్నారు.

బిక్కవోలు: కాపు ఉద్యమ నేత వంగవీటి మోహన్ రంగా 77వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. బిక్కవోలు మార్కెట్ సెంటర్ వద్ద బ్రహ్మదేవం శ్రీను తదితరులు రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వంగవీటి రంగా సేవలు చిరస్మరణీయం

మధురపూడి: వంగవీటి మోహనరంగా సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. కోరుకొండ మండలం కాపవరం, గాడాల, బూరుగుపూడి, కోటి తదితర గ్రామాల్లో గురువారం రంగా వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమావేశాలు, బైక్ ర్యాలీలు నిర్వహించారు. కాపవరంలో జరిగిన మండలస్థాయి కార్యక్రమానికి మండలంలోని వివిధ సామాజిక వర్గాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సభలో తెలగం శెట్టి శ్రీను మాట్లాడుతూ రంగా జీవితం నేటి యువతకు ఆదర్శనీయమన్నారు.

సీతానగరం: మండలంలోని ఇనుగంటివారిపేట, ముగ్గళ్ల, రాపాక తదితర గ్రామాలలో వంగవీటి రంగా జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అల్లూరి పోరాట పటిమ స్ఫూర్తిదాయకం



బిక్కవోలులో అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



రంగంపేట మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ వెంకటరత్నం



చంద్రేడులో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



కోరుకొండ మండలం కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలో అల్లూరి జయంత్యుత్సవం

బిక్కవోలు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ స్ఫూర్తిదాయకమని ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద అల్లూరి 127వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రామలక్ష్మి మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం తెల్లదొరలతో పోరాడి చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు చరిత్రను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రంగంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పి.వెంకటరత్నం ఆధ్వర్యంలో అల్లూరి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ వెంకటరత్నం మాట్లాడుతూ వీరత్వం, పౌరుషానికి ప్రాణం పోస్తే కనిపించే రూపం అల్లూరి సీతారామరాజు అన్నారు. ఆయన ఆశయాల సాధనకు అందరూ పాటుపడాలన్నారు. చంద్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం పాల్ సునీల్ ఆధ్వర్యంలో అల్లూరి 127వ జయంతిని ఘనంగా నిర్వహించారు.

పెదపూడి: అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం గ్రామంలో ఎన్డీఏ కూటమి నాయకులు గురువారం మన్యం వీరుడు అల్లూరి సీతారామారాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శివరామకృష్ణంరాజు, తమలంపూడి సుధాకర్‌రెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు

మధురపూడి: అల్లూరి సీతారామరాజు ఆదర్శప్రాయుడని కోరుకొండ ఎంపీడీఓ హేమసుందరరావు కొనియాడారు. కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. అలాగే గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జయంతి జరిగింది. కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ ఆధ్వర్యంలో అల్లూరికి నివాళులర్పించారు. కార్యక్రమాలలో కర్రి గణేష్, సుంకర శ్రీనివాసు, పడాల పండు, అడ్డాల శివయ్య, దాశెట్టి శ్రీను, గోకర కొండ శ్రీను, పచారి నరసింహమూర్తి పాల్గొన్నారు.

జీతాలు ఇప్పించాలి

సీతానగరం: తమకు 14 నెలల జీతాలు ఇప్పించాలని పురుషోత్తపట్నంలోని సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ యూనియన్ అధ్యక్షుడు కట్టమడురి వీరబాబు ఆధ్వర్యంలో కార్మికులు గురువారం మంత్రి కందుల దుర్గేష్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు తమ సమస్యను విన్నవించారు.

21న గురుపూజా మహోత్సవం

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి బాబా ఆలయంలో ఈ నెల 21వ తేదీన గురుపూజా మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గురువు మామిడిపల్లి రామారావుకు ఘనంగా సన్మానిస్తారు.

భోజనం వితరణ

సీతానగరం: చినకొండేపూడిలోని శ్రీషిర్డీ సాయిబాబా వసతి మందిరం ఆధ్వర్యంలో జరిగే అన్నదాన కార్యక్రమంలో భాగంగా గురువారం నిరుపేదలకు భోజనం ప్యాకెట్లు అందించారు. దాతలు డాక్టర్ ఘంటా గణేశ్వరరావు, రత్నం దంపతులు సుమారు 150 మందికి వీటిని సమకూర్చారు. పేదల ఇళ్లకు వెళ్లి సేవా సమితి సభ్యులు భోజనం పంపిణీ చేశారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

సీతానగరం: అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న పిల్లల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఏవీకే చైతన్య సూచించారు. స్టాప్ డయేరియా కాంపెయిన్‌లో భాగంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్య సిబ్బంది, మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లకు సమావేశం నిర్వహించారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం స్టాప్ డయేరియా కాంపెయిన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీడీపీవో ఝాన్సీ, ఏసీడీపీవో వరలక్ష్మి పాల్గొన్నారు.

శిక్షణతో బోధనా పద్ధతుల మెరుగు

కంబాలచెరువు: బోధనా పద్ధతుల మెరుగు కోసమే ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ అందిస్తున్నారని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా టీచ్ టూల్‌పై శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. వాటిని గురువారం ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి శిక్షణ పూర్తి చేసుకోవాలన్నారు. సందేహాలుంటే ఇక్కడే సమగ్రంగా తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఏఎంవో గౌరీశంకర్, రూరల్ ఎంఈవో అయ్యంకి దుర్గా తులసీదాస్, ఎంఈవో–2 చందు కుమార్, విషయ నిపుణులు పి.రమేష్ బాబు,ఎమ్.నాగేశ్వరరావు, జీవీ రమణ, సంధ్యారాణి, పి.సత్యప్రసాద్ పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు

కడియం: నిర్లక్ష్యంగా లారీని నడిపి ఇద్దరిని గాయాల పాల్జేసిన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఏడో అదనపు జడ్జి పి.బాబు గురువారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే.. 2019 నవంబర్ 19న వేమగిరి గట్టు వద్ద మోటారు సైకిల్‌పై యనమదల నవీన్‌కుమార్, కృపానంద వెళుతున్నారు. వారిని ధవళేశ్వరానికి చెందిన బి.మహేష్ కిరణ్ లారీతో ఢీకొట్టాడు. ఈ ఘటనలో మోటారు సైకిల్‌పై వెళుతున్న ఇద్దరూ గాయాలపాలయ్యారు. దీనిపై అప్పటి ఎస్సై షేక్ అమీనాబేగం కేసు నమోదు చేశారు. విచారణలో లారీ డ్రైవర్ నేరం నిరూపణ కావడంతో ఏడాది జైలు శిక్ష విధించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడిపినందుకు రూ.500 జరిమానా విధించారు. ఏపీపీగా ఓ.మహాలక్ష్మి వ్యవహరించగా, సాక్షులను కోర్టు కానిస్టేబుల్ గంగాధర్ ప్రవేశ పెట్టారు.

పశువైద్య శిబిరం

కడియం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గురువారం గర్భకోశ నివారణ పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, పశుసంవర్ధక శాఖ ఏడీ రవివర్మ, సిబ్బంది పాల్గొన్నారు. అంతకు ముందు స్థానిక బస్టాండ్ ఎదురుగా గల అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఎమ్మెల్యే తదితరులు పుష్పాంజలి ఘటించారు.